

కంటోన్మెంట్ కా బాద్‌షా.. శ్రీగణేశా!

● హస్తం గెలుపుతో మిన్నంటిన సంబురాలు
● ఫౌండేషన్ సేవలతో ప్రజల్లో తనదైన ముద్ర

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే కావడమే లక్ష్యంగా 15 ఏళ్లుగా అలుపెరగని ప్రయత్నం చేస్తున్న నారాయణ్ శ్రీగణేశ్ ఎట్టకేలకు అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. ఉప ఎన్నికల రూపంలో కలిసి వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. తాను గెలవడంతో పాటు నగరంలో అధికార కాంగ్రెస్‌కు తొలి విజయాన్ని అందించారు. తొలినాళ్లలో కాంగ్రెస్ నేతగా కొనసాగిన శ్రీగణేశ్‌కు ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కలేదు. 2014, 2018లో రెండు సార్లు భంగపడిన ఆయనకు రెండుసార్లు బీజేపీ అవకాశం కల్పించినప్పటికీ విజయ తీరానికి చేరుకోలేకపోయారు. అయినప్పటికీ నిరంతరం ప్రజల్లో ఉంటూ, శ్రీగణేశ్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారు. లాభాపేక్ష లేకుండా ప్రజలకు అందిస్తున్న సేవల కారణంగా కంటోన్మెంట్ ప్రజల్లో ఆయనకు ఆదరణ పెరుగుతూ వచ్చింది. పార్టీలకు అతీతంగా ప్రజాబలం ఉన్న ఆయన ఓ దశలో ప్రధాన పార్టీలకు హాట్ ఫేవరేట్‌గా మారారు. 2023 నవంబర్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆశావహుల జాబితాలో ఆయన పేరు ఉండటం గమనార్హం. చివరకు ఆ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి రెండోస్థానంతో సరి పెట్టుకున్నారు. తాజాగా ఉప ఎన్నికలు ఆయనకు మరువలేని జ్ఞాపకాన్ని అందించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్‌లో విజయం సాధించారు.



కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ నేతల సంబురాలు

అడ్డగుట్ట నుంచి అసెంబ్లీ వరకు..

తమిళ మూలాలు కలిగిన శ్రీగణేశ్ పూర్వీకులు బ్రిటిష్ హయాంలోనే నగరానికి వలస వచ్చారు. శ్రీగణేశ్ తండ్రి నారాయణన్ రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. నారాయణన్- సుగుణమ్మల్ దంపతులకు ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. శ్రీగణేశ్ ఐదో కుమారుడు. ఇంటర్మీడియేట్ పూర్తి చేసుకున్న వెంటనే ఆయన వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. శ్రీగణేష్ మార్బుల్స్ పేరిట చిన్నగా మొదలై నేడు నగరంలోనే పేరెన్నిక కలగిన మార్బుల్స్, టైల్స్ వ్యాపారస్తుల్లో ఒకరుగా ఎదిగారు. అదే సమయంలో రాజకీయాల పట్ల ఆసక్తి కలిగి కాంగ్రెస్‌లో చేరారు. 2009-14 మధ్యకాలంలో కాంగ్రెస్ యువనేతగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతూ చలివేంద్రాలు, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, యువతకు క్రీడా పోటీలు, మహిళలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ ఇప్పించారు. మరోపక్క కంటోన్మెంట్‌లో మిలటరీ పెత్తనం, స్థానిక పాలకుల అలసత్వం కారణంగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారం దిశగా పలు పోరాటాలు చేశారు. ముఖ్యంగా కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్య, ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న వారి ఓట్ల తొలగింపు, తిరుమలగిరి డంపింగ్ యార్డు, బొల్లారం ఆసుపత్రి తదితర సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తూ వచ్చారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరించడంతో పాటు, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పదే పదే చెప్పేవారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేగా గెలవడం పట్ల శ్రీగణేశ్ హర్షం వ్యక్తం చేస్తూ ఇది కంటోన్మెంట్ ప్రజల విజయం అంటూ అభివర్ణించారు.

దూసుకెళ్లిన హస్తం.. పడిపోయిన కారు

రసూల్‌పురా/కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం పొంది మూడో స్థానానికి పడిపోయింది. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చారు. మొదటి రౌండ్ నుంచి 8వ రౌండ్ వరకు ద్వితీయ స్థానంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత సాయన్న 9వ రౌండ్ నుంచి తృతీయ స్థానంలో కొనసాగారు. మొదటి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్‌కు 3,995 ఓట్లు పోలవ్వగా, ద్వితీయ స్థానంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితకు 3,140 ఓట్లు పోలవ్వగా శ్రీగణేష్‌కు 8,55 మెజార్టీ లభించింది. మొదటి రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి వంశతిలక్‌కు 2,666 ఓట్లు వచ్చాయి. తీరా 9 రౌండ్ ఫలితాలు వెల్లడయ్యే సమయానికి శ్రీ గణేష్‌కు 29, 726 ఓట్లు, వంశ తిలక్‌కు 20, 111, నివేదితకు 20, 99 ఓట్లు పోలయ్యాయి. చివరి 17వ రౌండ్ ఫలితం వెల్లడయ్యే సమయానికి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్‌కు 53, 651, వంశతిలక్‌కు 40, 445, నివేదిత సాయన్నకు 34, 462 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడిన తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ 13, 306 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కాగా సిట్టింగ్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత తృతీయ స్థానం పొందడంతో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలను తీవ్ర నిరాశ పరిచింది.

శాసన సభలో ఉత్సాహం.. లోక్‌సభలో నైరాశ్యం!

● దిగ్గజాలు కలిసినా వరించని విజయం
● మొదటి నుంచి చివరికి పడిపోయిన బీఆర్ఎస్

బన్సీలాల్‌పేట్: అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని మెజారిటీ స్థానాలు కైవసం చేసుకున్న బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో చతికిలా పడింది. ప్రధానంగా ఆ పార్టీ అభ్యర్థి పద్మారావు ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ అదే విధంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ 3వ స్థానానికే పరిమితం కావడం విశేషం. ఈ రెండు నియోజకవర్గాల్లో బలమైన నాయకులుగా చలామణి అవుతున్న పద్మారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఈ ఫలితాలు ఊహించని పరిణామం. సికింద్రాబాద్ ఏరియాలో రాజకీయంగా ఎంతో పలుకుబడి ప్రజాభిమానం పొందిన ఈ ఇద్దరూ నాయకులకు ఈ ఫలితాలు షాక్ ఇచ్చాయి. నిజానికి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2004, 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ఓ సారి మంత్రి, మరోసారి డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగిన టి. పద్మారావు తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కూడా ఎంతో కృషి చేసినప్పటికి ఇక్కడి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఆయను ఆదరించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చాంశనీయంగా మారింది. మరో పక్క సనత్‌నగర్ నియోజకవర్గంలో 2014 నుంచి వరుసగా గెలుస్తూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు మంత్రిగా కొనసాగిన తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీపరంగా నగరానికే పెద్ద దిక్కుగా వ్యవహరించారు. మంత్రిగా హైదరాబాద్ చక్రం తిప్పి తన రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించారు. కాని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ మూడవ స్థానానికే పరిమితమవడం తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై తీవ్ర రాజకీయ ప్రభావాన్ని చూపినట్లయింది.

కలిసిరాని కలయిక?

నగరంతో పాటు లష్కర్‌లో తిరుగులేని నాయకులుగా కొనసాగుతున్న పద్మారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు ఇద్దరూ కలిసినా ఈ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయారు. బీఆర్ఎస్ విజయం కోసం ఈ ఎన్నికల్లో అభ్యర్థి అయిన పద్మారావు అదే విధంగా తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు తీవ్రంగా కృషి చేసినా పార్టీ మూడవ స్థానానికే పరిమితం కావడం ప్రజల్లో వీరి ప్రాబల్యం తగ్గుపోయిందా...లేక వీరికి కలిసి రాలేదా అనే చర్చ జరుగుతుంది. ఏదీ ఏమైనా పద్మారావు, తలసాని కలయిక బీఆర్ఎస్‌కు పెద్దగా ప్రయోజనం చేకూర్చలేదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి తలసాని శ్రీనివాస్ యాదవ్, సనత్‌నగర్ నుంచి పద్మారావు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అదే విధంగా 2019 పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా తలసాని తన తనయుడు తలసాని సాయికిరణ్‌ను పోటీలో దింపగా అప్పట్లో ఈ ఇద్దరూ కూడా కలిసికట్టుగా పార్టీ విజయం కోసం పనిచేసినా ఫలితం లేకుండా పోయింది. మరో సారిగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో వీరి కలయిక ఏ మాత్రం ప్రజలపై ప్రభావం చూపలేకపోయింది. కనీసం రెండవ స్థానానికి కూడా చేరుకోలేక పోవడం పార్టీ వర్గాల్లో తీవ్ర నిరాశ కలిగింది.

మళ్లీ కమలానికే పట్టం!

రెండోసారి కిషన్‌రెడ్డి గెలుపు
- లష్కర్‌లో బీజేపీకి ఆధిక్యం
- రెండవ స్థానంలో హస్తం
- మూడోస్థానానికి బీఆర్ఎస్ పరిమితం



మర్రి శశిధర్‌రెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న బీజేపీ నేతలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు బీజేపీకే మద్దతు పలికారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో 16 రౌండ్లలో సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి 17,633 ఓట్ల ఆధిక్యత సాధించారు. సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఈ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 44,905 ఓట్లు పోలవ్వగా, బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి 62,538 ఓట్లు పోలయ్యాయి. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు 28,147 ఓట్లు రావడంతో మూడవ స్థానంలో నిలిచారు.

ప్రతి రౌండ్‌లో ఆధిక్యమే..

కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య ఓయూ ప్రాంగణంలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో మంగళవారం ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగింది. తొలిరౌండ్ నుంచే బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి అన్ని రౌండ్లలో ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. 1వ రౌండ్‌లో 75 ఓట్లతో ప్రారంభమైన కిషన్ రెడ్డి మెజారిటీ 16వ చివరి రౌండ్‌కు చేరేసరికి 17,633కు చేరింది.

◆ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలీయమైన శక్తిగా ఎదిగింది. 3వ రౌండ్ వరకు బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి గట్టి పోటీ ఇచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ వెనుకబడ్డారు. అనూహ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో కిషన్‌రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు.

రౌండ్ల వారీగా ఇలా..

క్ర.సం	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్
1	2991	2802	2916
2	3905	2285	2680
3	3122	2400	1704
4	4525	3686	1784
5	4115	3172	1562
6	4534	3794	1807
7	4116	2350	2035
8	1984	4939	1652
9	2912	2404	1333
10	4128	2363	2024
11	5677	1317	1651
12	4493	3472	1363
13	5513	3406	1688
14	4166	1906	1081
15	4269	2139	1618
16	2088	2470	1249
మొత్తం	62,538	44,905	28,147

6 నెలలకే తలకిందులు

గతేడాది నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలకు తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు లష్కర్ ప్రజలు పూర్తిగా భిన్నమైన తీర్పు ఇచ్చారు. 2023 శాసనసభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌కు 78,223, బీజేపీకి 25,202, కాంగ్రెస్‌కు 32,983 ఓట్లు పోలయ్యాయి. తాజాగా బీఆర్ఎస్ స్థానంలోని బీజేపీ రాగా కాంగ్రెస్ పార్టీ కొంతమేర పుంజుకుంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో 9 వేల ఆధిక్యత సాధించిన బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఈ మారు 17వేల పై చిలుకు ఆధిక్యత సాధించారు.

బీఆర్ఎస్ శ్రేణుల్లో నైరాశ్యం..

బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ విజయం ఖాయమన్న ధీమాలో ఉన్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ శ్రేణులకు తీరని నైరాశ్యం మిగిలింది. ఈ నియోజకవర్గం నుంచి నాలుగు మార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన పద్మారావుగౌడ్‌కు ఈ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ వస్తుందని ఊహించారు. తీరా లష్కర్ ప్రజలు రెండు జాతీయ పార్టీల అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టడంతో కౌంటింగ్ హాల్ నుంచి బీఆర్ఎస్ ఏజెంట్లు తీవ్ర నిరాశతో వెనుదిరగడం కనిపించింది.

సనత్‌నగర్‌లోనూ ముందంజలోనే..

సనత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి కిందికి వచ్చే సనత్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 'కమలం' వికసించింది. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి ఈ నియోజకవర్గం నుంచి 32,346 ఓట్ల ఆధిక్యత లభించింది. నియోజకవర్గంలో మొత్తం 2,53,381 ఓట్లకు 1,25,285 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కిషన్‌రెడ్డికి 66,849 రాగా, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 34,503 ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు 21,285 ఓట్లు పోలయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ 41,827 ఓట్ల మెజార్టీతో హ్యాట్రిక్ సాధించగా, పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి ఆ పార్టీ నుంచి బరిలో దిగిన పద్మారావుగౌడ్‌కు ఈ నియోజకవర్గంలో మూడో స్థానంతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది.

నోటాకు 684 ఓట్లు..

పోటీలో నిలిచిన అభ్యర్థులు ఎవరూ తమకు నచ్చలేదంటూ నోటా (నాన్ ఆఫ్ ది ఎబౌవ్)కు ఓట్ చేసిన వారూ సనత్‌నగర్ నియోజకవర్గంలో అధికంగానే ఉండడం గమనార్హం. మొత్తం 684 ఓట్లు నోటాకు వచ్చాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు 1040 ఓట్లు రాగా ఈ సారి తగ్గడం విశేషం.

జాతీయ పార్టీల వైపు మొగ్గు చూపారు



పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు జాతీయ పార్టీల వైపే మొగ్గు చూపారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామని ఆరు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో తనను 40 వేల పైచిలుకు భారీ మెజారిటీతో మూడోసారి గెలిపించిన లష్కర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ పార్టీ వైపు మొగ్గు చూపారన్నారు. ఆశించిన ఫలితం రాకపోయినప్పటికీ సికింద్రాబాద్ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఇండియా కూటమిదే అసలైన విజయం



మాట్లాడుతున్న మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమిదే అసలైన గెలుపు అని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 235కు పైగా ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థులు సాధించిన విజయమే నిజమైన గెలుపుగా అభివర్ణించారు. తెలంగాణ, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీలందరికి శుభాకాంక్షలు తెలిపారు. గతం కన్నా అధిక శాతం ఓటు బ్యాంక్‌ను పెంచుకుని దేశం, తెలంగాణలోనూ ప్రజల అభిమానాన్ని కాంగ్రెస్ పార్టీ చూరగొన్నట్లు పేర్కొన్నారు. మతం, దేవుడి పేరు చెప్పి ఓట్లు దండుకోవాలని చూసిన బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు.

అధిక ఫీజులపై పోరాడుతాం



ఆషాడపు మధు

ఉస్మానియా యూనివర్సిటీ: అధిక ఫీజులు, విద్యార్థి సంక్షేమం, విద్యారంగ సమస్యలపై పోరాడనున్నట్లు తెలంగాణ విద్యార్థి ఫోరం (టీవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఆషాడపు మధు పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశం అనంతరం టీవీఎఫ్ నూతన అధ్యక్షుడిగా మధును రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా (ప్రస్తుతం భూపలపల్లి) గణపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మధు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. విద్యారంగాన్ని పట్టిపీడిస్తున్న అధిక ఫీజులపై పోరాడనున్నట్లు ఈ సందర్భంగా మధు పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.31, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 105, గింజ బీక్కుడు 65, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 23, రూట్ రూట్ 23, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 31, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కిషన్‌రెడ్డికి నేతల అభినందనలు



లెక్కింపు కేంద్రం వద్ద కిషన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఎంపీగా విజయం సాధించిన కిషన్‌రెడ్డిని మంగళవారం రాత్రి మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి కలిసి అభినందనలు తెలిపారు. మహంకాళి జిల్లా పరిధిలోని సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీకి భారీ మెజారిటీ రావడం పట్ల జిల్లా నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.



బౌద్ధనగర్: కేంద్ర మంత్రి, రాష్ట్ర బిజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి రెండో సారి గెలిచిన సందర్భంగా బౌద్ధనగర్‌కు చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే బీసీల అభ్యున్నతి

లిబర్టీ: లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థుల వైపే మొగ్గు చూపారన్నారు. బీసీ సామాజిక వర్గాలు ఎప్పుడు కాంగ్రెస్‌కు అండగా ఉంటారని ఆ పార్టీ కూడా బీసీల ఆర్థిక అభివృద్ధి కోసం సామాజిక ప్రగతి కోసం జీవన ప్రమాణాల మార్పు కోసం మెరుగైన చర్యలు చేపట్టారని కుమారస్వామి సూచించారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల తీర్పును గౌరవించాలని ఆ తీర్పుకు కట్టుబడి ఉండాలన్నారు. తెలంగాణలో అధికారంలో ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీల కోసం వారి ప్రగతి కోసం నిరంతరంగా పని చేస్తుందన్నారు.

'కిషన్‌రెడ్డి గెలుపు మాదిగల గెలుపే'



సంబురాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలను ఓడించి బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించామని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు లడ్డు, ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు మల్లికార్జున్, కట్ట శంకర్, గజ్జల రాజశేఖర్, శివప్రసాద్, మహేందర్, డప్పు మహేష్, దశరథ్, నిఖిల్, దీపక్, సాయి, శ్రీనివాస్, మనోహర్, రజరపు ప్రవీణ్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



వంశీకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

లాలాపేట: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి ఘన విజయం సాధించిన గడ్డం వంశీకృష్ణను మంగళవారం తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్ యాదవ్, కొమ్ము శ్రీనివాస్‌యాదవ్,దాడి తిరుపతి, బోయిన శ్రీనివాస్, భాస్కర్, ప్రతాప్, భుక్య తిరుమల్, రవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అనారోగ్యంతో యాచకురాలి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో యాచకురాలు మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ షాహీద్‌పాషా వివరాల ప్రకారం.. మిర్జాల్‌గూడ సమీపంలోని లాలాగూడలోని రైల్వే క్వార్టర్స్ వద్ద ఈ నెల 1న రాత్రి సమయంలో సుమారు 55-60 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని యాచకురాలు మృతి చెంది ఉంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కుమారుడి చికిత్సకు వచ్చిన వ్యక్తి అదృశ్యం



సాంబయ్య

రాంగోపాల్‌పేట్: కుమారుడి చికిత్స కోసం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా వీరాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సాంబయ్య (32) తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 1న నాంపల్లిలోని నీలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆయనతో పాటు చిన్నాన్న పవార్ సాంబయ్య తోడుగా వచ్చారు. ఈ నెల 2న సాంబయ్య తల్లి హైదరాబాద్‌కు వచ్చినట్లు ఫోన్ చేసింది. రెతిఫైల్ బస్టాండ్ వద్ద ఉన్న ఆమెను తీసుకుని వచ్చేందుకు రాపిడోపై సాంబయ్య సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. కొద్ది గంటల తర్వాత పవార్ సాంబయ్య ఆయనకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పవార్ సాంబయ్య ఆయన తల్లికి ఫోన్ చేయగా తీసుకుని వెళ్లేందుకు రాలేదని చెప్పింది. రాపిడో డ్రైవర్‌ను వాకబు చేస్తే రెతిఫైల్ ఎదురుగానే దించినట్లు చెప్పాడు. తెలిసిన వాళ్లు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పనికి వెళ్తున్నానని చెప్పి..



సలీం

బౌద్ధనగర్: పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వారాసిగూడలోని షాబాద్ గూడ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సలీం(38) ఓ చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. గత నెల 31న పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన సలీం ఎంతకీ తిరిగి రాలేదు. సలీం పని చేసే చోటుకు వెళ్లి అతడి తండ్రి ఆరా తీయగా వారం రోజుల నుంచి పనికి రావడం లేదని చెప్పారు. స్నేహితులు, బంధువులతో ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీజేపీకి మద్దతుగా నిలిచిన దేశప్రజలు



స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ శ్రేణులు

బన్సీలాల్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించి నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రి కాబోతున్న సందర్భంగా బన్సీలాల్‌పేట్ డివిజన్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఐడీహెచ్ కాలనీలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం బీజేపీ సమన్వయకర్త రాజశేఖర్‌రెడ్డి, కేంఎ క్రిష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వం పట్ల యావత్తు దేశం మద్దతుగా నిలిచి బీజేపీని ఆదరించిందన్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఘన విజయం సాధించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. సికింద్రాబాద్‌లో బీజేపీ జెండా ఎగరడం ద్వారా తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఈటల విజయంపై సంబరాలు



రసూల్‌పురా: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడంతో కంటోన్మెంట్‌లో బీజేపీ శ్రేణులు, ఈటల అభిమానులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. తాడ్‌బంద్‌లో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సదా కేశవరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను అధిష్ఠానం ప్రకటించిన రోజే ఆయన గెలుపు ఖాయమైందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన ఈటలకు కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సామల సత్తిరెడ్డి, మాచర్ల శ్రీనివాస్, వెంకటాచారి, శ్యాంకుమార్, అశోక్, కనకరాజు, మహేష్, నాగరాజు, చిన్నం పాండు పాల్గొన్నారు.